అభివృద్ధి, సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి



కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని గెలిపిస్తాయని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. గురువారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేయడంతో పార్టీ పట్ల ప్రజలకు విశ్వాసం పెరిగిందన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకొని గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంతో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు... ముఖ్యంగా మహిళలు బ్రహ్మరథం పడుతున్నారని సుజాతా నాయక్ అన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ ,వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 13, వంకాయ 18, బెండ 40, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్ 20, క్యాబేజీ 19, క్యారెట్ 33, దొండ 23, ఆలు 33, ఉల్లి 19, గోకర 35, దోస 16, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 35, మునగ 21, చిలగడదుంప 65, బీట్‌రూట్ 21, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 65. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

ఉక్కిరి బిక్కిరి..!

- ప్రజారోగ్యానికి కుంపటిలా సీసం బట్టీలు
- కలుషితమవుతున్న భూగర్భ జలాలు
- మామూళ్ల మత్తులో అధికారులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా కొనసాగుతున్న సీసం బట్టీలతో ప్రజారోగ్యానికి ముంపు పొంచి ఉంది. జల్‌పల్లి పార్థివాడ, శ్రీరాం కాలనీలలో ఎలాంటి అనుమతులు లేకుండా సీసం బట్టీలు యథేచ్ఛగా ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో పాడైన బ్యాటరీ, స్క్రాప్ నుంచి బ్యాటరీలు తీసుకొచ్చి ఇక్కడ వాటిని ధ్వంసం చేసి అందులోని సీసాన్ని కరిగిస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ పెద్ద ఎత్తున కాలుష్యం వెలువడుతోంది. ఇవి వెలువడే సమయంలో దట్టమైన పొగ స్థానికులను శ్వాస తీసుకోకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సమస్య తీవ్రతను గుర్తించిన ప్రజలు మున్సిపాలిటీ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం ఉండటం లేదు. తొమ్మిదేళ్ల క్రితం గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఒకట్రెండు పర్యాయాలు దాడులు చేసి సీసం బట్టీలను ధ్వంసం చేశారు. ఐదేళ్ల క్రితం పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ కఠినంగా వ్యవహరించడంతో కొన్నాళ్ల పాటు స్తబ్దుగా ఉన్న నిర్వాహకులు ఆయన బదిలీ కాగానే తిరిగి తమ కార్యకలాపాలను ముమ్మరం చేస్తున్నారు. రాత్రయితే చాలు అక్కడ వెలువడే పొగతో కాలనీల వాసులు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే శ్రీరాం కాలనీ వాసులు గురువారం తెల్లవారుజామున కూడా ఆయా కంపెనీలను ముట్టడించారు. వెంటనే మూసేయ్యాలని లేకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కలుషితమవుతున్న భూగర్భ జలాలు..

జల్‌పల్లి, శ్రీరాం కాలనీలలో కొనసాగుతున్న సీసం బట్టీలతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. కాలం చెల్లిన బ్యాటరీలను ధ్వంసం చేసి అందులో నుంచి సీసాన్ని బట్టీల ద్వారా కరగదీసి ద్రవంగా మార్చే క్రమంలో పెద్ద ఎత్తున రసాయన వ్యర్థాలను భూమిలోకి వదులుతున్నారు. ఈ కారణంగా శ్రీరాం కాలనీలో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడి బోర్లలో మొదటి 10నుంచి 15 నిమిషాల పాటు నీరు రంగు మారి వస్తుండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో పాటు సీసాన్ని కరిగించే సమయంలో క్యాడ్మియం, లెడ్ కరిగి దాని వ్యర్థాలు కూడా దుమ్ము రూపంలో పొగలో కలిసి కాలనీల్లో పడుతోంది. ఇలా వచ్చిన రసాయనాలతో కూడిన దుమ్ము ఇళ్లల్లోని నీటి సంప్, ఇతర నీటి నిల్వలలో పడటంతో స్థానికులు ఇబ్బందికి గురవుతున్నారు.

శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు..

ప్రతి రోజు రాత్రి 9 నుంచి ఉదయం 5 గంటల వరకు కొనసాగుతూ స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దట్టమైన పొగల కారణంగా శ్వాస పీల్చుకోలేక సతమతమవుతున్నారు. ఈ సమస్యతో చిన్నారులు, వృద్ధులు టీబీ, కేన్సర్, చర్మ వ్యాధులకు గురవుతున్నారు. ఈ విషయమై శ్రీరామ హిల్స్, బృందావన్ కాలనీ, రిలయన్స్ కాలనీల ప్రజలు కంపెనీలపై దాడులు చేసేందుకు కూడా పలుమార్లు విఫలయత్నం చేసినా కంపెనీల నిర్వాహకులే ఎదురు దాడి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

విమానాలకు సిగ్నల్ సమస్య..

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలో ఈ సీసం బట్టీలు కొనసాగుతున్నా అటు మున్సిపాలిటీ అధికారులు గానీ, ఇటు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. మామూళ్ల మత్తులో నిద్రపోతున్న అధికారులు మిన్నకుండిపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విమానాశ్రయాలకు కొన్ని కిలోమీటర్ల దూరంలోనే కొన్నిసార్లు అధికారులు పొగను పైకి విడుస్తూ సిగ్నల్‌ను ఇవ్వడం జరుగుతుందన్నారు. దాని ఆధారంగా విమానాల ల్యాండింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. కాని ఇక్కడ విమానాశ్రయానికి ఒకట్రెండు కిలోమీటర్ల దూరంలో ఇలాంటి అక్రమ కంపెనీల ద్వారా వెలువడుతున్న పొగతో పెను ప్రమాదం పొంచి ఉంది.



శ్రీరాం కాలనీలోని సీసం బట్టీ వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు



కరగదీసిన సీసాన్ని ప్లేట్లలో పోస్తున్న కార్మికులు



సీసం బట్టి

వృద్ధులకు శ్వాసకోశ ఇబ్బందులు



సీసం బట్టీల సమస్య తమను తీవ్రంగా వేధిస్తుంది. ముఖ్యంగా వయో వృద్ధులకు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతోంది. చీకటి పడినప్పటి నుంచి తెల్లవార్లు వెలువడుతున్న దట్టమైన పొగను భరించలేకపోతున్నాం. ఈ విషయమై పలుమార్లు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదులు చేశాం. ప్రజల ఆరోగ్యానికి చేటు చేసే పరిశ్రమలపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– చంద్రకాంత్ రావు, శ్రీరాం కాలనీ

రాత్రయిందంటే సమస్య ఎక్కువే



రాత్రయిందంటే చాలు సీసం బట్టీల సమస్య ఎక్కువ అవుతోంది. అధికారులు స్పందించకపోవడంతో ప్రజలందరూ కలిసి మూసి వేయించేందుకు మూడు నాలుగు పర్యాయాలు ప్రయత్నించడంతో తాళాలు వేసుకొని జారుకున్నారు. ఒక ఏడాది పాటు స్తబ్దుగా ఉన్న నిర్వాహకులు తాజాగా మళ్లీ మొదలెట్టారు. ఈ సమస్యను భరించలేక ప్రజలు ఇళ్లు అమ్ముకొని వేరే ప్రాంతానికి వెళుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– మన్న రవి కుమార్, శ్రీరాం కాలనీ

కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న సునీతా మహేందర్‌రెడ్డి

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎన్నికల కార్యాలయాన్ని పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భీమిడి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డిని గెలిపించాలి: దేప



మాట్లాడుతున్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని టీపీసీసీ మెంబర్, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం రామకృష్ణాపురం డివిజన్ తెలంగాణ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో భాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత 10 ఏళ్ల కాలంగా దేశంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ దోపిడీ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ గడిచిన 100 రోజుల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిందని అన్నారు. చేవెళ్ల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసే గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎన్నికల ఇన్‌ఛార్జి నిజాముద్దీన్, రాష్ట్ర మహిళ నాయకురాలు నేరెళ్ల శారద, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణాపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గణేష్ నేత పాల్గొన్నారు.

డ్రైనేజీ లీక్ కాకుండా చూడండి



వికాస్‌నగర్‌లోని సెంట్రల్ బ్యాంక్ ముందు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

చైతన్యపురి: చైడివిజన్ పరిధిలోని వికాస్‌నగర్‌లోని సెంట్రల్ బ్యాంక్ ముందు ఉన్న మ్యాన్‌హోల్ బ్లాక్ అయి డ్రైనేజీ నీరు పొంగి రోడ్డుపై పారుతోంది. పొంగిన మురుగు నీటి వల్ల పరిసరాల్లో దుర్వాసన వస్తోందని, దోమలు విపరీతంగా వ్యాపిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వెంటనే లీకేజీకి మరమ్మతు చేపట్టకపోతే సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉందంటున్నారు. కార్పొరేటర్, సంబంధింత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ నీరు రహదారులపై పారకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెత్తకుప్పలను తొలగించండి!



ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్తకుప్పలు

మలక్‌పేట: మూసారంబాగ్‌లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. పారిశుద్ధ్య పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడి చెత్త కుప్పలు పేరుకుపోయి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకుపోయిన చెత్తను క్రమంగా తొలగించకపోవడం వల్ల సమస్యలు తలెత్తున్నాయి. తొలగింపునకు ప్రత్యేక వాహనం కేటాయించినా కొన్నిచోట్ల చెత్త తరలించి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈస్ట్‌ప్రశాంత్‌నగర్ ఫుట్‌పాత్‌లపై చెత్త ను తొలగించడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రౌడీషీటర్‌పై కత్తులతో దాడి

సైదాబాద్: రౌడీషీటర్‌పై ముగ్గురు యువకులు కత్తులతో దాడి చేసిన ఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ కథనం ప్రకారం...డీషీటర్ మహ్మద్ నసీరుద్దీన్ అలియాస్ చాకూ నసీర్ (37) సైదాబాద్ చౌరస్తా వద్ద నివసిస్తున్నాడు. షహీన్‌నగర్‌లో నివసించే అతడి స్నేహితుడి కుమారుడు మహ్మద్ మున్నా కొద్దిరోజులుగా తాను పని చేసే ఫైనాన్స్ ఆఫీస్‌లో సీజ్ చేసి వాహనాల యజమానులను బెదిరించాలని తరచూ నసీర్‌కు ఫోన్ చేసి అడుగుతున్నాడు. అందుకు నిరాకరించడంతో నసీర్‌ను చంపుతానంటూ మున్నా ఫోన్‌లో బెదిరించాడు. గురువారం తెల్లవారుజామున మున్నా మరో ఇద్దరు స్నేహితులతో నసీర్ ఇంటికి చేరుకున్నాడు. అతడు బయటకు వస్తూ తర్వాత మాట్లాడుకుందాం అంటుండగానే మున్నా తన వెంట తెచ్చుకున్న కత్తితో, మరో ఇద్దరు సాదు, ఆసిఫ్‌లు ఇనుపరాడ్‌తో అతనిపై దాడి చేశారు. దాడిలో నసీర్‌కు తల, కుడి భుజాలకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే వారు దాడి చేస్తుండగా నసీర్ తప్పించుకోవడానికి సమీపంలోనే ఉన్న సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయంలోకి వెళ్లడంతో మున్నా అతని స్నేహితులు అక్కడి నుంచి పారిపోయారని, దాంతో నసీర్ బతికిపోయాడని స్థానికుల ద్వారా తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ విడుదల



శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 23న వనస్థలిపురంలో నిర్వహించే శోభాయాత్ర పోస్టర్‌ను గురువారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 23న సాయంత్రం 4 గంటలకు శోభాయాత్ర వనస్థలిపురంలోని రామాలయం నుంచి ప్రారంభమై పోలీస్‌స్టేషన్, రెడ్ ట్యాంక్, ఎన్జీఓస్ కాలనీ, ఎస్‌కేడీ నగర్ చౌరస్తా, వైదేహినగర్, సాహెబ్‌నగర్‌లోని త్రినేత్ర ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ముగుస్తుందని అన్నారు. యాత్రలో మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, పార్టీ పలు విభాగాల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, మహిళలు, హనుమాన్ భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు చింతల రవికుమార్, లగ్గోని శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

రసాభాసగా కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం

- వాగ్వాదం చేసుకొని.. పరస్పరం తోసుకున్న నేతలు
- వెనుదిరిగిన పార్టీ అభ్యర్థి, నాయకులు

సైదాబాద్: మల్కాజిగిరి లోక్‌సభ స్థానం ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం రసాభాసగా ముగిసింది. పార్టీ నాయకులు పరస్పరం దూషించుకోవటంతో మొదలైన రగడ ఒకరినొకరు తోసుకునే వరకు వెళ్లడంతో వేదికపై ఉన్న పార్టీ అభ్యర్థి, రాష్ట్ర నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోవాల్సి వచ్చింది. వివరాలు... మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఎల్‌బీనగర్ శాసనసభ నియోజకవర్గంలోని లింగోజిగూడ, చంపాపేట డివిజన్ ప్రజలు, నాయకులతో గురువారం సాయంత్రం చంపాపేటలోని సామ సరస్వతి గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. పార్టీ ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, ఇతర నాయకులు హాజరయ్యారు. సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో లింగోజిగూడ, చంపాపేట డివిజన్లలో తక్కువ ఓట్లు వచ్చాయని అనడం దుమారానికి కారణమైందని తెలుస్తోంది. ఆయన మాటలకు జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తప్పు పట్టడంతో ఇరువురి కార్యకర్తలు ఒక్కసారిగా వాగ్వాదానికి దిగటంతో సమావేశం గందరగోళంగా మారింది. ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగి వివాదం చెలరేగి తోపులాటకు దారితీసింది. గొడవ సద్దుమణగక పోవడంతో పార్టీ అభ్యర్థి, నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

21న మాంసం దుకాణాల బంద్

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో ఈ నెల 21న మహావీర్ జయంతి సందర్భంగా మాంసం, చికెన్ షాపులను మూసేయాలని జోనల్ వెటర్నీ అధికారి రంజిత్ తెలిపారు. గ్రేటర్ పరిధిలో జైనులు అధికంగా ఉండటంతో ఆ రోజున భారీ ర్యాలీలు తీసే అవకాశం ఉందని, దీంతో ఆదివారం రోజున జోనల్ పరిధిలో అన్ని మాంసం, చికెన్, బీఫ్ షాపులను మూసేయాలని ఆయన దుకాణదారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా షాపులను తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ నుంచి మారుతినగర్ మీదుగా రాజీవ్ గృహకల్ప వరకూ ప్రధాన రహదారి పనులను అధికారులు ప్రారంభించారు. గతంలోనే కిలో మీటర్ మేర ఉన్న ఈ బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. ఇటీవల మారుతినగర్ మెట్రో వాటర్ వర్క్స్ పైప్‌లైన్ల పనులతో అండర్ డ్రైనేజీ పనులు చేపట్టడంతో బీటి రోడ్డు గుంతల మయంగా మారింది. ఈ క్రమంలో స్థానికుల ఫిర్యాదుల అనంతరం ఇబ్బందులను తెలుసుకున్న ఉన్నతాధికారులు మంజూరైన రూ.6 లక్షలతో బీటీ రోడ్డు వేసేందుకు అధికారులు ముందుకొచ్చారు. ఇక్కడ రోడ్డు పనులు పూర్తయితే మారుతినగర్‌లోని ఫేస్ 1, 2, 3తో పాటు రాజీవ్ గృహకల్పకు, అలాగే ఈ మార్గం గుండా నడుస్తున్న ఆర్టీసీ బస్‌లకు, ఇతర వాహనాలకు, పాదాచారులకు పలు కాలనీల వాసులకు రవాణా కష్టాలు తీరనుంది.

శ్యామల స్వరాంజలి పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

నాగోలు: కొత్తపేట డివిజన్ న్యూనాగోలులోని భార్గవ రామ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ గడ్డం శ్యామల రచించిన శ్యామల స్వరాంజలి భక్తి గీతాల పుస్తకాన్ని తెలుగు భాషాభిమాని శ్రీపతి రామకృష్ణ చేతుల మీదుగా బుధవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీ రామకృష్ణ మాట్లాడుతూ, డాక్టర్ శ్యామల ఈ భక్తి గీతాలే కాకుండా ఎన్నో తెలుగు గజల్స్‌ను కూడా రాశారని, కొమర్రాజు ఫౌండేషన్ తరఫున ఆయన, వారి కుటుంబ సభ్యులు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రముఖ సాహిత్యవేత్త పీఎల్ఎన్ శర్మ మాట్లాడుతూ, అందరికీ అర్థమయ్యేలా, పాడుకునేలా సరళ భాషలో ఎన్నో భక్తి గీతాలను ఈ పుస్తకంలో రాశారని అన్నారు. ఇటువంటి భక్తి గీతాలు, సమాజంలో తెలుగు భాషతో పాటుగా భక్తినీ పెంపొందించేందుకు దోహద పడతాయన్నారు. రచయిత్రి గడ్డం శ్యామల మాట్లాడుతూ, తాను దేవీ నవరాత్రుల సమయంలో రచించిన భక్తి గీతాలను ఒక పుస్తక రూపంలో ప్రచురిస్తే వాటిని ఎక్కువ మంది ప్రతి రోజూ తమ ఇంట్లో లేదా.. భక్తి కార్యక్రమాల్లో పాడుకోవడానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో శ్రీ పన్నాల శ్రీరాములు, భార్గవ రామ బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు కొమర్రాజు జ్ఞానకుమార్, కాలనీ వాసులు మధుసూదన్ రెడ్డి, యశ్వంత్ రావు, ఇందిరా శర్మ, వల్లీ, మధుసూదన్ రెడ్డి, యశ్వంత్ రావు, రమణమూర్తి పాల్గొన్నారు.

ప్రపంచ కార్మికులారా ఏకంకండి



మేడే సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాండురంగా చారి

వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా పిలుపు

నాగోలు: దేశ ప్రగతికి మూల స్తంభాలైన శ్రమజీవులు తమ కష్టంతో ఈ దేశంలో సంపదను సృష్టిస్తే అది కార్పొరేట్ శక్తుల చేతుల్లో బందీ కావడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను మోసం చేయడమే అని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగా చారి అన్నారు. గురువారం కొత్తపేట వర్కర్స్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మేడే ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాండురంగా చారి మాట్లాడుతూ, దేశంలోని కార్మికులు, కర్షకులు, పేదలు, బలహీన వర్గాల ప్రజలు ఏకమై మేడే కార్మిక పోరాటాల ఆశయ సాధన, నియంతృత్వ, నియంత పాలనకు వ్యతిరేకంగా నిర్మాణాత్మక పోరాటాలు చేయాలన్నారు. ఇందులో భాగంగా మే 1న కొత్తపేట చౌరస్తా సిరిపురం యాదయ్య చౌరస్తాలో జరిగే మేడే సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీ రాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కొప్పు యాదయ్య, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పూజారి శీను, మీడియా రాష్ట్ర కన్వీనర్ కంఠం సైదులు, ఆర్‌కేపురం డివిజన్ కన్వీనర్ మమ్మద్ ఇస్మాయిల్, సరూర్‌నగర్ డివిజన్ నాయకులు దెండే అయోధ్య, వఱ్రే ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

15 లోక్‌సభ స్థానాల్లో గెలిపే కాంగ్రెస్ లక్ష్యం



మాట్లాడుతున్న మధుయాష్కీ, వేదికపై ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి తదితరులు

నాగోలు: రాష్ట్రంలోని 15 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే దిశగా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సందర్భంగా నాగోలు, హయత్ నగర్, మన్సూరాబాద్ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో గురువారం నాగోలులోని అనంతుల రాం రెడ్డి గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మధుయాష్కీ గౌడ్‌తో పాటు మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ, కాంగ్రెస్ అధిష్టానం సూచించిన మేరకు పార్లమెంట్ ఎన్నికల్లో మిషన్–15 లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో సోదరి పట్నం సునీత మహేందర్ రెడ్డి గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. సునీతా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, తాను జెడ్పీ చైర్మన్‌గా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించానని తెలిపారు. ఈ నియోజకవర్గ సమస్యలపై తనకు అవగాహన ఉందని,తనను ఎంపీగా గెలిపిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రోడ్ల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మిద్దెల జితేందర్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, పార్టీ నేతలు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, గజ్జి భాస్కర్ యాదవ్,గుర్రం శ్రీనివాస్ రెడ్డి, ఈశ్వరమ్మ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి: రమణారెడ్డి

మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నేత సామ రమణారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చంపాపేట డివిజన్ అంబేడ్కర్ వాడలో గురువారం సునీతామహేందర్ రెడ్డి తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అంబేడ్కర్‌వాడ కాలనీవాసులు సంజన, హుస్సేన్, దేవరాజ్, రాజు, కృష్ణ, పీసన్న, మల్లన్న, మెట్టు వెంకట్ రెడ్డి, శ్రీకృష్ణ యాదవ్, యాదగిరి పాల్గొన్నారు.

ఇచ్చిన మాటాకు కట్టబడి ఉండే ముఖ్యమంత్రి

లింగోజిగూడ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాడని, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులు కేటాయిస్తారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అధ్యక్షతన కర్మన్‌ఘాట్‌లోని ఎస్ విలేజ్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి మధుయాష్కీతో పాటు ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరై మాట్లాడారు. తనను గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని సునీతా రెడ్డి అన్నారు. అమరవాది లక్ష్మీనారాయణ, టీపీసీసీ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు రామ్మోహన్ గౌడ్, జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్ రెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం చైర్మన్ నల్ల రఘుమారెడ్డి మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి: చాడ



మాట్లాడుతున్న సీపీఐ నేత చాడ వెంకట్‌రెడ్డి

మన్సూరాబాద్: పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్‌కు బాటలు వేస్తాయని, దేశంలో ప్రజాస్వామ్యం ఉండాలా.. నియంతృత్వం ఉండాలా అనేది ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ మండల సీపీఐ కార్యాలయాన్ని ఆయన గురువారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, పౌరులు తమ ప్రాథమిక హక్కును కోల్పోతారని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో జతకట్టి కేసీఆర్ నియంత పాలనను గద్దె దించామని అన్నారు. అదే విధంగా ఇండియా కూటమిలో సీపీఐ కీలకంగా పని చేస్తున్నదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు ఈటీ నర్సింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, హయత్‌నగర్ మండల కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు శ్రీదేవి, సక్రు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, సరిత, నాయకులు పారిజాత, అనిత, జ్యోతి, సౌజన్య, నాగరాజు, శేఖర్, ముత్తయ్య పాల్గొన్నారు.